

రైతుల ఖాతాల్లో 'భరోసా' నిధులు





తొలిరోజు 15 గ్రామాల రైతులకు పెట్టుబడి సాయం

- 14,226 మంది రైతులకు రూ. 15.96 కోట్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)
గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 15 మండలాల్లోని 15 గ్రామాల్లో లాంఛనంగా ఎంపిక చేసిన రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేసింది. ఆయా గ్రామాల్లోని 14,226 మంది రైతులకు చెందిన 26,600 ఎకరాల సాగు భూమికిగాను 15.96 కోట్ల రూపాయలను భరోసా సాయంగా వారి ఖాతాల్లో జమ చేసింది. సోమవారం రైతుల ఖాతాల్లోకి ఈ నిధులు వచ్చాయి.

- **3.5 లక్షల ఎకరాలకు సాయం అందే అవకాశం**

రైతుబంధు పథకం 2018 వానాకాలం సీజన్‌లో ప్రారంభం కాగా 2023-24 యాసంగి వరకు 12 విడతలుగా జిల్లా రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించారు. ఈ 12 విడుతల్లో జిల్లా రైతులు 1,913 కోట్ల రూపాయల లబ్ధి పొందారు. ఈ సీజన్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకంగా పేరును మార్చి ఎకరాకు ఆరు వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందించడానికి నిర్ణయించి ంది. ఆదివారం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించింది. గతంలో సాయం అందించిన 3,55,230 ఎకరాలలో 5,356 ఎకరాలు మినహాయిస్తే సుమారు 3.50 లక్షల ఎకరాలకు ఎకరాకు 6వేల చొప్పున సీజన్‌కు 210 కోట్ల మేరకు రైతులకు పెట్టుబడి సాయం అందే అవకాశం ఉంది.

- **జిల్లాలో సాగులో లేని భూమి 5,357 ఎకరాలు**

జిల్లావ్యాప్తంగా పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన మేరకు వాటిలో 3,63,817 ఎకరాల భూమి ఉంది. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో 5,357 ఎకరాల భూమి సాగులో లేకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్న భూమిగా గుర్తించారు. ఈ భూమిని మినహాయించి మిగతా భూమికి రైతు భరోసా సాయం అందించాల్సి ఉన్నది. 2023-24 యాసంగి సీజన్‌లో 1,90,826 మంది రైతులకు 177.61 కోట్ల రూపాయలు పెట్టుబడి సాయంగా అందించారు. ఆ సీజన్‌లో ఎకరాకు ఐదు వేల చొప్పున రైతుబంధు పథకం అమలు చేశారు. ఐదు వేల రూపాయల చొప్పున జిల్లా రైతులకు అందిన మొత్తాన్ని పరిగణలోకి తీసుకుంటే 3,55,230 ఎకరాలకు పెట్టుబడి సాయం అందింది. గ్రామసభల్లో నిర్వహించిన సర్వేలో ఎన్ని ఎకరాల సాగు భూమి వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నారో అధికారికంగా ప్రకటించలేదు.

- **స్పష్టత ఇవ్వని ప్రభుత్వం**

ఎంత మందికి ఎకరాకు ఆరువేల చొప్పున

మిగతా 8వ పేజీలో...

మెనూ చార్జీలు పెంచాలి

- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సుభాష్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిగుడ్లకు ప్రభుత్వం ఐదు రూపాయలు ఇవ్వడం సరైంది కాదన్నారు. మార్కెట్లో కోడిగుడ్డు ధర ఏడు నుంచి ఎనిమిది రూపాయల వరకు ఉందన్నారు. నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు అంగన్‌వాడీ సెంటర్లకు ఎలా సరఫరా చేస్తుందో అదే తరహాలో మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేయాలన్నారు. మెనూ చార్జీలు ప్రతి విద్యార్థికి 25 రూపాయలు చెల్లించాలని, మధ్యాహ్నభోజన కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పదివేల రూపాయల వేతనం ఇస్తామని పేర్కొందని, దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సరుకుల బిల్లులకు సంబంధించిన బకాయిలను వెంటనే విడిదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న, యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయిలు, ప్రధానకార్యదర్శి రజిత, దేవక్క, సరోజన, ఎం లక్ష్మి, కె సత్తెమ్మ, రేణుక, హాలియా, సాహెన, నాగవ్వ, పద్మ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 298 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఇంచార్జి డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్‌డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

- సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం భూమి సేకరించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ ఆదేశించారు. ప్రతి మండలంలో పది ఎకరాల భూమిని గుర్తించాలని, అందుకు దేవాదాయ శాఖ భూములను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన లాగిన్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పూర్తిస్థాయిలో ధ్రువీకరించి కలెక్టర్‌కు పంపించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మండల అధికారులను ఆదేశించారు.

ఆర్టీసీ ఆస్తులు ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థకు చెందిన ఆస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేసే ప్రయత్నం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి విమర్శించారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 22 డిపోలు, బస్టాండ్ల ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం, పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వాలు మూడు విడతలుగా ఆర్టీసీ సంస్థ భూములను ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నాలుగో విడతలో 22 డిపోలు బస్టాండ్లు, ఖాళీస్థలాలను ప్రైవేట్ వ్యక్తు లకు ఇవ్వడానికి చేయడానికి ప్రతి పాదనలు సిద్ధం చేసిందన్నారు. గతంలో ఆర్టీసీలో 58 వేల మంది కార్మికులు ఉండగా ప్రస్తుతం 42 వేలకు పడిపోయిందన్నారు. 10,550 బస్సులు ఉంటే ప్రస్తుతం అవి తొమ్మి ది వేలకు వచ్చాయన్నారు. ఆర్టీసీలో కారుణ్య నియమకాలు తప్పకొత్తగా ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. పల్లె వెలుగు నడిచే రూట్లలో ఎలక్ట్రిక్, డీలక్స్ బస్సులు నడుపుతున్నారన్నారు. దీంతో మహిళలు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోలేక పోతున్నారన్నారు. ఆర్టీసీ ఆస్తులను, సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ బామండ్లపల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు చేరని మిడ్ మానేరు నీరు
- ఎండుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు

7

నేటి నుంచి రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీలు

7

జమ్మికుంట సీఐ పై విచారణ

6

ఐసీటీసీకి రాష్ట్రస్థాయి అవార్డు



కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ సదానందచారి

సుభాష్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసు పత్రిలోని ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్)కి రాష్ట్రస్థాయి పురస్కారం దక్కింది. కొన్ని సంవత్సరాలుగా హెచ్ఐవీ రోగులకు కౌన్సెలింగ్ ఇచ్చి మానసిక స్థయిర్యాన్ని కల్పించి ఉత్తమ సేవలందించినందుకు రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ అందజేశారు. ఈ అవార్డును సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ డాక్టర్ ఎం సదానందచారి అందుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ నవీన పాల్గొన్నారు.



అభివృద్ధి.. అవినీతి

ఐదేళ్ల 'నగరపాలక' చిత్రం

- పరస్పర ఫిర్యాదులతో రాజకీయ వేడి
- బల్దియాలో నాలుగేళ్లు బీఆర్ఎస్‌దే ఆధిపత్యం
- చివరి ఏడాదిలో మారిన సీన్
- కాంగ్రెస్, బీజేపీలో కార్పొరేటర్ల చేరికలు
- మూడు రోజుల ముందు మేయర్ బీఆర్ఎస్‌కి గుడ్‌బై
- నేటితో ముగియనున్న కరీంనగర్ కార్పొరేషన్ పాలకవర్గ పదవీకాలం

కరీంనగర్ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ స్మార్ట్ సిటీగా ఎంపికవడంతో ఐదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించింది. వందల కోట్ల నిధులు రావడంతో నగర రూపురేఖలు మారాయి. అభివృద్ధితోపాటు భారీగా అవినీతి జరిగిందంటూ ఆరోపణలు, ఫిర్యాదులూ వచ్చాయి. పలుసార్లు అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లే ఫిర్యాదులు చేసి ప్రతిపక్ష పాత్రను పోషించారు.

- **సఫాయి మిత్రలో ద్వితీయ స్థానం**

సఫాయిమిత్ర సురక్షా పోటీల్లో దేశంలోని మూడు లక్షల జనాభా కలిగిన నగరాల్లో కరీంనగర్ నగరపాలక సంస్థ ద్వితీయ స్థానంలో నిలిచి నాలుగు కోట్ల ప్రైజ్‌మనీని సొంతం చేసుకుంది. 2023 ఆగస్టు వరకు నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, పనులు దర్శనమిచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌తో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. ప్రభుత్వం మారడంతో నిధులు తగ్గిపోయాయి. మున్సిపాలిటీలో రాజకీయాలు మారాయి. మున్సిపల్ ఎన్నికల్లో 60 సీట్లలో బీఆర్ఎస్ 43 సీట్లను గెలుచుకోగా, ఎంఐఎం, బీజేపీలు మిగిలిన 17 డివిజన్లలో గెలిచాయి. ఆ తర్వాత కొంత మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు బీజేపీలో చేరగా, ఒకరిద్దరు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 12 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఒకరిద్దరు బీజేపీలో చేరారు.

- **చివరలో నాటకీయ పరిణామం**

ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం ఈనెల 28తో ముగియనుంది. మూడు రోజుల క్రితం మేయర్ యాదగిరి సునీల్‌రావు, మరో ఇద్దరు కార్పొరేటర్లతో కలిసి బీజేపీలో చేరారు. మూడురోజులుగా బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్‌యాదగిరి సునీల్‌రావు మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల యుద్ధం కొనసాగుతోంది. మంగళవారం పాలకవర్గ పదవీకాలం ముగియనుండగా సోమవారం డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్ నేతృత్వంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ సునీల్‌రావుపై అవిశ్వాస నోటీసుతోపాటు ఆయనను సస్పెండ్ చేసి, అవినీతిపై విచారణ జరుపాలంటూ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

- **నిధుల వెల్లువ**

2017లో స్మార్ట్‌సిటీలో కరీంనగర్ చేర్చినప్పటికి 2019 వరకు డీపీఆర్ రూపకల్పన, టెండర్ల నిర్వహణతోపాటు కొద్దిపాటి ప్రారంభోత్సవాలు, కోట్ల రూపాయల ప్రాజెక్టుల్లో లక్షల రూపాయల పనులు మాత్రమే జరిగాయి. 930 కోట్ల స్మార్ట్‌సిటీ నిధుల్లో 850 కోట్ల రూపాయల పను లు పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ నిధులు-1లో 147 కోట్లు, సీఎం హామీ, పట్టణ ప్రగతి నిధులు 347 కోట్లు, 40 కోట్లు, మున్సిపల్ జనరల్ ఫండ్ 200 కోట్లు, 40 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు, ఐదు కోట్లు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఇలా.. ఐదేళ్లలో దా దాపు 1400 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆయా పనుల్లో భారీ గా అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు, మాజీ మేయర్‌తోపాటు ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌తోపాటు ఇతర రాజకీయపార్టీల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



- **నేడు పాలకవర్గ వీడ్కోలు సమావేశం...**

మంగళవారంతో ప్రస్తుత పాలకవర్గ పదవీ కాలం ముగియనున్నది. దీంతో మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో కమిషనర్ పమేలా సత్పతి వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్‌పమేలా సత్పతిని నగరపాలక సంస్థప్రత్యేక అధికారిగా నియమించడంతో బుధవారం నుంచి ప్రత్యేక పాలన కొనసాగనున్నది.

రైతులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

వీణవంక, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రైతులు విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని కరీంనగర్ టెక్నికల్ డీఈ కె ఉపేందర్ సూచించారు. మండలంలోని చ ల్లూరు రైతులతో కలిసి పొలంబాట కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాలకు నీళ్లు పెట్టే సమయంలో తడి చేతులతో విద్యుత్తు పరికరాలను ముట్టవద్దన్నారు. విద్యుత్ ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. రైతులు తప్పని సరిగా కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజేందర్, జమ్మికుంట ఏఈ కె. శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



గిరిజన తండాల్లో ఎక్సైజ్ దాడులు

● 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం ● 30 లీటర్ల సారా స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్, బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, గుంటపల్లిచెరువు తండాల్లో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, సిరిసిల్ల టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ శైలజ ఆధ్వర్యంలోని అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 30 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి పదిమంది అనుమానితులను తహసీల్దార్ రామచంద్రం ఎదుట బైండోవర్ చేశామని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. బైండోవర్లను ఉల్లఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సిరిసిల్ల ఎక్సైజ్ ఎస్‌ఐ ప్రణీత్‌గౌడ్, సిబ్బంది శ్రీనివాస్, రాజు, మల్లేశ్, కిషోర్‌కుమార్, కృష్ణకాంత్, యోగివర్మ, సర్ధార్‌అలీ, శంకర్, సుమన్, రాకేశ్, సాయికృష్ణ, లలిత, రూప పాల్గొన్నారు.


బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పురుగుల మందు తాగి కూలీ ఆత్మహత్య

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన పర్స రాములు (55) అనే కూలీ పురుగులమందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు ఇంటి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో రాములు ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. కుటుంబీకులు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

అనారోగ్య కారణాలతో ఉరివేసుకొని..

రామగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలో నాగెపల్లి శంకర్(45) ఉరివేసుకొని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత కాలంగా క్షౌరవృత్తిని మానేసి తాగుడుకు బానిసై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెరట్లో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

గంగాధర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కురిక్యాల శివారులో గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారు వరద కాలువ దగ్గర రోడ్డు పక్కన 30 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతి చెంది ఉంది. గుర్తు తెలియని వ్యక్తిగా అనుమా దాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళ ముఖంపై రక్తపు మరకలు ఉండగా ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో విచారిస్తున్నారు.


మహిళ మృతదేహం

చెరువులో మృతదేహం గుర్తింపు

గొల్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామ రెవెన్యూ శివారులోని ఎర్రకుంట చెరువులో 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో సోమవారం లభ్యమైంది. మృతుడి ఒంటిపై కాఫీ రంగు నైట్ ప్యాంట్, ఎరుపు, గోధుమ రంగు డబ్బాలు డిజైన్‌తో ఉన్న షర్టు ధరించి ఉన్నట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు అటు వైపు వెళ్లగా చెరువులో మృతదేహం కనిపించిందని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇదీ హత్యా..ఆత్మహత్యా..? ఎన్ని రోజుల క్రితం సంఘటనా జరిగింది? అన్న కోణంలో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహంను గుర్తు పట్టిన వారు ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి ఫోన్ నెం. 8712656817, గొల్లపల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఫోన్ నెం. 8712656826 అనే నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

రాష్ట్ర మహాసభల్లో సీపీఎం నాయకులు


రాష్ట్రసభల్లో పాల్గొన్న సీపీఎం నాయకులు

భగత్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలకు కరీంనగర్ నుంచి జిల్లా ప్రతినిధులు హాజరయ్యారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహెబ్, కోనేటి నాగమణి, జిల్లాకార్యక్రమాల రిపోర్టును కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకట్‌రెడ్డి ప్రవేశపెట్టారు.

రేపు వేసవిలో విద్యుత్ సరఫరాపై సమీక్ష

గణేశ్‌నగర్ : వేసవిలో విద్యుత్ సరఫరాపై బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వ హించనున్నారు. నగరంలో కరీంనగర్ సర్కిల్ నోడల్ అధికారి అన్నపూర్ణాదేవి సర్కిల్ ఎస్ఈ సమక్షంలో చర్చించనున్నారు.

కూచిపూడిలో 'ఉజ్వల' ప్రదర్శన

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ
- పలు ఆలయాల్లో ప్రత్యేక ప్రదర్శనలు
- పలువురికి నృత్య శిక్షణ


గుమ్మడి ఉజ్వల

కోల్‌సిటీటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన గుమ్మడి ఉజ్వల కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. కళల పట్ల ఉన్న ఆసక్తితో కూచిపూడిలో డిప్లమాతో పాటు మాస్టర్స్ చేసి కళాకారులకు శిక్షణ ఇస్తోంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు ప్రదర్శనలిచ్చి అవార్డులు, ప్రశంసలు అందుకుంటోంది.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గుమ్మడి పెద్దులు-నిర్మలాదేవి కూతురు ఉజ్వల. చిన్నప్పటి నుంచి కళల పట్ల ఉన్న ఆసక్తితో డిగ్రీ చదువుతూనే గురువుమేదరి నర్సయ్య వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందింది. ఆయన ప్రోత్సాహంతో మంథని సంగీత, నృత్య కళాశాలలో డిప్లోమా పూర్తి చేసింది. అనంతరం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో మాస్టర్స్ పూర్తి చేసి అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నది. తాను నేర్చుకున్న కళను పలువురికి నేర్పించాలనే సంకల్పంతో నృత్య శిక్షణ కేంద్రాన్ని 2014లో స్థాపించి ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దుతోంది.



కూచిపూడి నృత్యప్రదర్శనలో ఉజ్వల


అవార్డు అందుకుంటున్న ఉజ్వల

● ఎన్నో అవార్డులు...ప్రదర్శనలు...

ఉజ్వల రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్నది. నేటికి కేంద్ర సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శ్రీశైలం, బాసర, వేముల వాడ, తదితర దేవాలయాల్లో, మహాశివరాత్రి, దసరా ఉత్సవాల్లో నృత్య హారతి ఇస్తోంది. 2019లో స్వచ్ఛభారత్ రామగుండం కార్పొ రేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఉజ్వల ఎన్నికైంది. ఇటీవల హైదరాబాద్‌లో బుక్ ఫెడరేషన్ కార్య క్రమం, ఘంటసాల శతజయంతి ఉత్సవంలో ఉజ్వల ప్రదర్శన ఇచ్చారు. 2014లో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో తొలిసారి తెలంగాణ నుంచి సుకూన్ ఫెస్టివల్‌లో ఉజ్వల కూచిపూడి నృత్య ప్రదర్శనిచ్చి ఆకట్టుకుంది.

● పాఠశాలల్లో నేర్పించాలి

తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ, ఉజ్వల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో కళను ఒక విద్యగా అందించాలని, కళల పట్ల అవగాహన కల్పించాలని కళా ఉజ్వల ప్రాజెక్టుతో మరో అడుగు ముందుకు వేసింది. ఈ ప్రాజెక్టుతో కళను నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో మానసిక, వ్యక్తిత్వ వికాసంపై చైతన్యం తీసుకురావడంతోపాటు ఉపాధి, అభివృద్ధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అందుకోసం ప్రయత్నం చేస్తున్నానని ఉజ్వల తెలిపారు.

నక్సలైట్లలో చేరే అవకాశం కల్పించండి!

● ప్రజావాణిలో ప్రభుత్వానికి మిడ్ మానేరు నిర్వాసితుడి దరఖాస్తు ● వ్యవస్థపై నమ్మకం పోయిందన్న చల్లా బాలరాజు

సిరిసిల్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యల్ని నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఓ సంచలన దరఖాస్తు వచ్చింది. తనకు నక్సలైట్లలో చేరే అవకాశం కల్పించాలంటూ ఓ వ్యక్తి ఏకంగా ప్రభుత్వానికే దరఖాస్తు చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ ఆర్‌అండ్ఆర్ కాలనీకి చెందిన చల్ల బాలరాజు ఈ వినతిపత్రం సమర్పించారు. మిడ్ మానేరు ప్రాజెక్టులో తమ కుటుంబం 4.50 గుంటల స్థలం, అందులో 1.50 గుంటల్లో ఉన్న ఇంటిని కోల్పోయిందని తెలిపారు. నిర్వాసితుడిగా ఇంటికి సంబంధించి పరిహారాన్ని రూ.16 లక్షలుగా నిర్ణయించారని, ఇందులో రూ.3.09 లక్షల పన్ను మినహాయించి మిగిలింది ఇచ్చారని పేర్కొన్నారు. కానీ, మిగిలిన 3గుంటల స్థలానికి ఇంతవరకు పరిహారం ఇవ్వలేదన్నారు. పైగా పునరావాసం కింద ఇంటి స్థలాన్ని తాము కోరుకున్న గ్రామంలో కాకుండా మరో గ్రామంలో ఇచ్చారని తెలిపారు. అందుకు కూడా తాము అంగీకరించినా.. ఆ స్థలాన్ని సైతం వెనక్కి తీసుకుని.. నివాసయోగ్యం కాని బండరాళ్లున్న మరో స్థలం ఇచ్చారని వాపోయారు. పరిహారం కోసం ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా.. అధికారులు భూసేకరణ చట్టాలను అమలు చేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అర్హులకు న్యాయం చేయకుండా మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యుడైన ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలంటూ బాలరాజు గతేడాది జనవరిలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కానీ, ప్రభుత్వం నుంచి చర్యలు లేకపోవడంతో గతేడాది జూన్‌లో హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేకపోవడంతో ఈ నెల 24న హైదరాబాద్‌లో సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మరోసారి వినతిపత్రం ఇచ్చారు. తనకు చట్టాలపై, న్యాయవ్యవస్థపై నమ్మకం పోయిందని అందులో పేర్కొన్నారు. అలాంటి అధికారులను కొట్టడం, తిట్టడం చట్ట విరుద్ధమైనందున.. నక్సల్స్‌లోకి వెళ్లి ప్రజాకోర్టులు ఏర్పాటు చేసి పేదలకు, సామాన్యులకు, నిరక్షరాస్యులకు న్యాయం చేయాలనే ఆలోచన వచ్చిందని తెలిపారు. అందుకు తనకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి దీనిని పరిశీలించి.. బాలరాజు సమస్యను పరిష్కరించాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు పంపించారు. కాగా, బాలరాజు మరోసారి ఇదే విజ్ఞప్తితో సోమవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో ప్రజావాణికి హాజరై వినతిపత్రం ఇచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో ఐదు నెలల జైలు

జగిత్యాల అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించిన కేసులో ఒకరికి ఐదు నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన చిట్టపురం పోషన్న(58) అనే వ్యక్తి ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 2019 సంవత్సరంలో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవే శపెట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

హుజూరాబాద్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు సోమవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందాడిపల్లి గ్రామానికి చెందిన మామిడాల రవీందర్‌రెడ్డి(53) తన పొలంలో కూరగాయల సాగు కోసం నారు తెచ్చేందుకు ద్విచక్రవాహనంపై ములంగూర్‌కు వెళ్లి నారుతీసుకుని స్వగ్రామానికి వస్తున్నాడు. సింగాపూర్ గ్రామ శివారులోని పెద్ద గుట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రవీందర్‌రెడ్డి కిందపడిపోయాడు. కిందపడిన రవీందర్‌రెడ్డి శరీరంపై నుంచి భారీ వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై పరిశీలన జరిపారు. మృతుడు మాందాడిపల్లి వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

● ఒకరి పరిస్థితి విషమం

హుజూరాబాద్ మండలంలోని రాంపూర్-జూపాక గ్రామ రహదారిపై ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాంపూర్ గ్రామానికి చెందిన మాడుగుల శ్రీనివాస్‌తో పాటు జూపాక గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాయ్యాయి. ఈ ప్రమాదంలో మాడుగుల శ్రీనివాస్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఇల్లంతకుంట నుంచి ద్విచక్రవాహనంపై కముటం శృతి, ఇట్టిరెడ్డి పద్మ వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనకనుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శృతి, పద్మ గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో వృద్ధురాలిపై దాడి

ముత్తారం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంథని రాజక్క అనే వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన బంధువు మంథని వంశీ మద్యం మత్తులో ఆదివారం రాత్రి దాడి చేశాడు. సమ్మక్క వంశీ ఇద్దరు కలిసి ఆదివారం రాత్రి మద్యం సేవించగా మాటామాట పెరిగి సమ్మక్కపై వంశీ కర్రతో దాడి చేశాడు. గొడవను ఆపేందుకు మంథని రాజక్క అడ్డు రాగా రాజక్కకు గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

జమ్మికుంట సీఐపై విచారణ

హుజూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట టౌన్ సీఐ వరంగంటి రవికుమార్ ఓ అట్రాసిటీ కేసు విషయంలో మధ్యవర్తి వద్ద ముడుపులు తీసుకున్నారని ఎదుర్కొంటున్న ఆరోపణలపై హుజూరా బాద్ ఏసీపీ కార్యాలయంలో పోలీస్ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. అట్రాసిటీ కేసు విషయంలో రూ. 3లక్షల నగదును మధ్య వర్తి షేక్ సాబీర్ అలీ ద్వారా బాత్‌రూం బకెట్లో పెట్టించి సీఐ తీసుకు న్నాడని, వారి ఇద్దరి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడి యో రికార్డు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. విచారణకు హాజరు కావాలంటూ షేక్ సాబీర్ అలీకి రెండ్రోజుల క్రితం పోలీసులు నోటీసులు అందజేయగా, హుజూరాబాద్ ఏసీపీ కార్యాల యంలో పోలీసు అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. సీఐ తన వద్ద తీసుకున్న డబ్బులకు సంబంధించిన ఆధారాలు, ఇతర వివరా లు అన్ని విచారణ అధికారులకు అందజేసినట్లు విచారణ అనంతరం షేక్ సాబీర్ అలీ వెల్లడించారు. అట్రాసిటీ కేసు ఫిర్యాదుదారులు, కేసు కాకుండా మధ్యవర్తికి ద్వారా ముడుపులు అప్పగించిన వారిని కూడా పోలీసులు త్వరలో విచారించనున్నట్లు తెలుస్తుంది. సదరు మధ్యవర్తి విచారణకు హాజరయ్యే ముందు తనపై పోలీసులు కేసు పెట్టి రిమాండ్ చేసే అవకాశం ఉందని వీడియో విడుదల చేశాడు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్


సీజ్ చేసిన వాహనాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్లకోట సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌తో పాటు రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామని తహసీల్దార్ రామచంద్రం సోమవారం తెలిపారు. గ్రామంలోని కోట ప్రాం తంలో కొందరు వ్యక్తులు ఎక్స్‌కావేటర్ యంత్రంతో మట్టిని తీస్తూ రవాణా చేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. వాహనాలను స్థానిక తహసీల్ కార్యాలయానికి తరలించామని చెప్పారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ రామచంద్రం హెచ్చరించారు.

శ్రీరాముడి విగ్రహం ధ్వంసం

● మానేరు వంతెనపై బీజేపీ, హిందూ సంఘాల రాస్తారోకో

తంగళ్లపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దేవాలయంలో నెలకొల్పిన శ్రీరాముడి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో తంగళ్లపల్లి మండలంలో రాస్తారోకో, ఆందోళనలతో ఉద్రిక్తత నెలకొంది. తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో గత శ్రీరామనవమి రోజు పూజలు నిర్వహించి సీతా, రామలక్ష్మణుల విగ్రహాలను తాత్కలికంగా నెలకొల్పారు. సోమవారం ఉదయం శ్రీరాముని విగ్రహం తల ధ్వంసమై ఉండడాన్ని స్థానికులు గమనించారు. గుడికి తాళం లేకపోవడం, ఎవరో ఉద్దేశపూర్వకంగానే శ్రీరాముని విగ్రహాన్ని ధ్వంసం చేశారని భావించారు. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావుతో పాటు బీజేపీ నాయకులు కేసీఆర్‌నగర్‌లోని ఆలయం ఎదుట ఆందోళనకు దిగారు. విగ్రహం ధ్వసం చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ రామ్మోహన్ తన సిబ్బందితో చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయం మండలం మొత్తం వ్యాపించడంతో హిందూ సంఘాలు, బీజేపీ, ఏబీవీపీ నాయకులు మానేరు వంతెనపై రాస్తారోకోకు దిగారు. సుమారు అరగంట పాటు రాస్తారోకో చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సీఐ మొగిలయ్య, ఎస్‌ఐ రామ్మోహన్ చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.


రాస్తారోకో చేస్తున్న బీజేపీ, హిందూ సంఘాల నాయకులు

యూరియా కోసం బారులు


సారంగాపూర్ సహకార సంఘం వద్ద రైతులు

సారంగాపూర్, జనవరి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ సహకార సంఘం కార్యాలయం ఎదుట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సోమవారం యూరియా కోసం బారులు తీరారు. ఒక్కో రైతుకు ఆధార్‌కార్డుపై ఐదు బస్తాలను అందించారు. చాలా మంది రైతులకు యూరియా అందక పోవడంతో గంటల కొద్ది లైన్‌లో నిలబడి వెనుదిరిగారు. యూరియా కొరతపై సహకార సంఘం సీఈవో శివను వివరణ కోరగా సోమవారం రైతులు ఒక్కసారిగా రావడంతో కొరత ఏర్పడిందన్నారు. మంగళవారం మరో లారీ లోడ్ యూరియా వస్తుందని రైతుతు వచ్చి తీసుకెళ్లాలని వివరణ ఇచ్చారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ఎలిగేడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పొలాలకు ఎస్సారెస్పీ సాగునీరు అందడం లేదని సోమవారం ఎలిగేడు, లాలపల్లి ఆయకట్టు ప్రాంత రైతులు డి-86ప్రధాన కాలువ వద్ద ఆందోళన చేశారు. 13-ఎల్ ఉపకాలువ ద్వారా 55 ఎకరాల పైచిలుకు పొలాలకు సాగునీరు అందాల్సి ఉంది. నాట్లు వేసుకొని రోజులు గడుస్తున్నా తక్కువ నీరు రావడంతో సుమారు 25మంది రైతులు డి-86 ప్రధాన కాలువ వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సారెస్పీ డీఈ ఎండి.షిరాజ్, ఏఈలు అయాజ్, జెలని సమస్యను పరిష్కరిస్తామన్నారు. 13ఎల్ కాలువ తూములో గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లు వేయడంతో నీటి సరఫరా తక్కువైందని రైతులకు వివరించారు. ఎక్స్‌కావేటర్ సహాయంతో తూముల్లో అడ్డుగా ఉన్నబండరాళ్లను తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈడీఈ షిరాజ్ మాట్లాడుతూ కాలువల్లో అడ్డుగా బండలు వేసినా, తూములను ధ్వంసం చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ముత్కల మల్లేశం, వెంగల్ దాసు తిరుపతి, ముంజంపల్లి చిన్నసాయిలు, బావు రవీందర్, సప్పుల రవి ఉన్నారు.


సాగునీటికోసం డి86కాలువ వద్ద రైతులు

మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై కేసు

-ఎన్నికల నిబంధనలు అతిక్రమించాడని కోర్టులో పిటిషన్

మెట్‌పల్లి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించాడనే ఫిర్యాదుపై కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై శనివారం కేసు నమోదైంది. 2018 ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించాడని ఆరోపిస్తూ పట్టణానికి చెందిన పుల్లా రాజగౌడ్ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని కోర్టులో పిటిషన్ వేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 25న కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలో నివాసముండే సింగరేణి కార్మికుడు గంగాధర రమేష్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వెనుక తలుపు తొలగించి దొంగలు లోనికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న రూ.3.46లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. రమేష్ కుటుంబ సభ్యులు ఆదివారం గోదావరిఖనిలోని జవహర్‌నగర్‌కు వెళ్లారు. సోమవారం వచ్చి చూసే సరికి చోరీ విషయం వెలుగులోకి వచ్చింది.

ఆత్మహత్య కేసులో ఒకరి అరెస్టు

వీణవంక, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడగా, మృతికి కారణమైన భర్తను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన నీల సాయికిరణ్ అనే వ్యక్తి రమ్య అనే యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. వివాహం చేసుకున్నప్పటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేశాడు. భరించలేక వివాహిత ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. తన మేనకోడలు మృతికి భర్త కారణమంటూ మృతురాలి మేనమామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సాయికిరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘాట్ రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో?




గుట్టపై వెలిసిన నర్సింహస్వామి

పూర్తయిన ఫార్మేషన్ రోడ్డు

- 13 ఏళ్ల క్రితం పనులకు శంకుస్థాపన
- పూర్తి కాక నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి భక్తుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన కొండపై ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి మోక్ష మెప్పుడు కలుగుతుందోనని భక్తులు ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏటా మాఘ మాసంలో పౌర్ణమికి ముందు నాలుగు రోజుల పాటు నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మహారాష్ట్ర నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. 1967 సంవత్సరంలో ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. అప్పుడు స్వామి వారి ఆదాయం 1800 రూపాయలు ఉండగా ప్రస్తుతం 60లక్షల రూపాయలకు చేరుకుంది. ఎత్తైన గుట్టపై స్వామి వారు వెలియడంతో భక్తులు మెట్ల మార్గం ద్వారా వెళ్లి మొ క్కులు చెల్లించుకుంటారు. గుట్టపై ఉన్న స్వామి వారిని దర్శించుకోవ టానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవ డంతో ఆలయ ఫౌండరీ ఛైర్మన్ చెన్నాడి సత్యనారాయ ణరావు 1991-1993 సంవత్సరంలో గుట్ట కింద నర్సింహ స్వామి ఆలయాన్ని నిర్మించి స్వామి వారిని ప్రతిష్ఠించారు. వివిధ రకాల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విజయం చేకూర్చమని నర్సింహస్వామికి ముడుపులు కడతారు. పదవులు వచ్చాక ఘాట్ రోడ్డు నిర్మాణం మరిచి పోతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.



నల్లగొండలో నర్సింహస్వామి గుట్ట



ఘాట్ రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

● 2012లో పనులకు శంకుస్థాపన

2012లో అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి ఎంపీ 10లక్షల రూపాయలు, దేవాలయ నిధులు 30లక్షల రూపాయలతో ఫార్మేషన్ రోడ్డు చేశారు. ఘాట్ రోడ్డు నిర్మాణం జరిగినట్లయితే భక్తుల రద్దీ పెరగటంతో పాటు ఆలయానికి ఆదాయం పెరుగుతుంది. ప్రముఖ పుణ్య క్షేత్రాలైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాలకు మధ్యలో కొడిమ్యాల మండలంలోని నల్లగొండ నర్సింహస్వామి ఆలయం ఉంది. గుట్టపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం, సైడ్ డ్రైనేజీ, సీసీ నిర్మాణం, రోడ్డుపై అవసరం ఉన్న చోట కల్వర్టుల నిర్మాణం, పైపుల ఏర్పాటు, కింది నుండి గుట్టపై వరకు విద్యుత్ లైట్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. భక్తులకు డార్మెటరీ హాల్, తాగు నీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సంబంధిత శాఖ అధికారులు నిధులు మంజూరు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి డిగ్రీ కళాశాల విద్యార్థి



జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన సాయిచరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన గడప సాయిచరణ్ అనే విద్యార్థి కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో నిర్వహించే జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాల నుంచి పది మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో భాగంగా అగ్రహారం డిగ్రీ కళాశాల నంచి సాయిచరణ్ ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 11 నుంచి 17 వరకు జరగబోయే జాతీయ సమైక్యతా శిబిరంలో సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాల్లో సాయిచరణ్ పాల్గొంటాడని తెలిపారు. సాయిచరణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు శారద, శకుంతల అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెద్దపులి ఆనవాళ్లు పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కొడిమ్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపులి కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుకార్లను నమ్మవద్దని, పులి సంచారంపై ఎలాంటి సమాచారం ఉన్నా తెలుపాలని ప్రజలను కోరారు. మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆవుపై ఐదు రోజుల క్రితం పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందగా అటవీ అధికారులు మండలంలోని బొల్లోనిచెరువు. కొండాపూర్, నల్లగొండ శివారులను ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతాల్లో పెద్దపులి ఆనవాళ్ల కోసం తిరుగుతున్నారు. వేములవాడ మండలం ఫాజుల్‌నగర్, నూకలమర్రి శివారులో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులను, వ్యవసాయ కూలీలను, పశువుల కాపరులను పెద్దపులి ఆనవాళ్లపై వివరాలు తెలుసుకున్నారు. కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో డీఆర్వో ముషీర్ ఆహ్మద్, బీట్ అధికారులు అశ్విని, ఆనందరావు, వసీం, ప్రవీణ్, మహేందర్, వాచర్లు ఐదు రోజులుగా మండలంలోని అటవీ ప్రాంతాన్ని నాలుగు బృందాలుగా విడిపోయి పరిశీలిస్తున్నారు. అడవిలో సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి ఆనవాళ్లు లభించక పోవడంతో కొడిమ్యాల అటవీ ప్రాంతం నుంచి పెద్దపులి పోయినట్లుగా అటవీ అధికారులు భావిస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు

- ప్రారంభించనున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మూడో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీలు మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు కరీంనగర్ క్రీడా కేంద్రంగా ప్రారంభం కానున్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో రాష్టంలోని 20 పోలీస్ జోన్ల నుంచి 2500 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. జిల్లా కేంద్రంలోని 12 క్రీడావేదికలపై 29 క్రీడ అంశాలలో పోటీలను ఘనంగా నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ హెడ్ క్వార్టర్స్‌లోని క్రీడా మైదానంలో డీజీపీ ఇంటెలిజెన్సీ తెలంగాణ శివధర్ రెడ్డి ప్రారంభించనున్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని సీటీసీ, హెడ్ క్వార్టర్స్, అంబేద్కర్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్, సీపీటీసీ, కరీంనగర్ క్లబ్, జీఎస్ అకాడమీ, అలుగునూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో పోటీలను నిర్వహించనున్నారు.



క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సోషల్‌మీడియాలో అసత్యప్రచారాలు..

- సీపీకి ఫిర్యాదు చేసిన మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తనపై గత 3 రోజులుగా బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్ వి రాజేందర్‌రావు, బీఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ 43వ డివిజన్ అధ్యక్షుడు నవాజ్ హుస్సేన్‌లపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నగర మేయర్ వై సునీల్‌రావు సోమవారం పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. తన ఫోటోలతో అసభ్యకరంగా, పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు చేస్తున్నవారిపై చర్యలు తీఉకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేసి విచారణ జరిపించాలి

సుభాష్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ధరణి 13బి ద్వారా అక్రమ పట్టాలను రద్దు చేసి, దానిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్, కోరపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాలకు చెందిన తమ భూములను గత 30 సంవత్సరాలుగా తామె సాగుచేసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా ఒక వ్యక్తి అప్పటి జమ్మికుంట తహసీల్దార్ కన్నం నారాయణ ద్వారా ఎలాంటి విచారణ చేయకుండా తమ కుటుంబ సభ్యులు, బంధువుల పేరుపై 13బి పట్టాలు పొందారని ఆరోపించారు. ఆయన తరువాత వచ్చిన తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్ళామని ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సంతకాలు ఫోర్జరీ చేసి చర్చికి అంబేడ్కర్ భవనంకు స్థలం ఇచ్చినట్లుగా చూపుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంపత్, శ్రీనివాస్, కొండయ్య పాల్గొన్నారు.

వేములవాడ క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- స్వామి వారి దర్శనానికి నాలుగంటల సమయం



భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లలో భక్తులు గంటల తరబడి బారులు తీరారు. ఆది దేవుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు కోడెమొక్కు క్యూలై న్‌లో సుమారుగా నాలుగు గంటలపాటు నిరీక్షించి కోడెమొక్కు చెల్లించుకున్నారు. క్యూ లైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని తరించారు. గండాదీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని మొక్కు లు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భీమేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు అభిషేక పూజలో పాల్గొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

● ఘనంగా మహా లింగార్చన

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం మహా లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సోమవారంను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉదయం స్వామి వారికి మమన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు చేపట్టారు. సాయంత్రం ఆలయ అద్దాల మండపంలో లింగార్చనంలో దీపా లను వెలిగించి మహా లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న ఆలయంలో పలుకుబడికి పెద్దపీట

- ఎక్స్ వేదికగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన భక్తుడు

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయంలో నిబంధనలకు విరుద్ధంగా పలుకుబడి ఉన్న ఓ పెద్ద మనిషికి ప్రాముఖ్యత ఇవ్వడం విమర్శలకు దారితీసింది. రాజన్న ఆలయంలో ప్రతి సోమవారం ఉదయం నిర్వహించే నిత్యపూజలు, అలంకరణ పూర్తి కాకముందే స్వామి వారితో పాటుగా అమ్మవారిని దర్శించుకుంటున్న తీరు ప్రస్తుతం వేములవాడలో చర్చనీయాంశంగా మారింది. ప్రతి సోమవారం ఉదయం నాలుగు గంటలకు స్థానికులకు ఉచిత దర్శనం అవకాశం ఉంది. స్థానికేతరుడైన అతను తన కుటుంబీలకుతో కలిసి స్వామివారి గర్భగుడిలో గంటల తరబడి పూజలు చేస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానిక భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యక్తికి పూజారులు దగ్గరుండి మరీ పూజలు నిర్వహిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు ఎదురువుతున్నాయి.

సోమవారం ఉదయం రాజన్న ఆలయ గర్భగుడిలో అతను పూజలు నిర్వహిస్తుండగా స్థానిక భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఓ భక్తుడు రాజన్న ఆలయ ఈవోకు వాట్సప్‌లో, జిల్లా కలెక్టర్, సీఎంవోకు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేసిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆలయ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రూ.7, 150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 29మంది రైతులు 324 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 21క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు.

ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

యూజీసీ గైడ్ లైన్స్ వెనక్కి తీసుకోవాలి

గణేశ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యూజీసీ గైడ్ లైన్స్ వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరపు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం శాతవాహన యూనివర్సిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీసీ గైడ్‌లైన్స్ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తికి విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలని, రాజకీయాలకు అతీతంగా విద్యారంగానికి సంబంధించిన వారినే వీసీలుగా నియమించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు కనకం సాగర్, లద్దునూరి విష్ణు పాల్గొన్నారు.

గేట్ పడితే పడిగాపులు

- ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి



చేగుర్తికి వెళ్లే దారిలో రైలు గేటు పడటంతో నిరీక్షిస్తున్న గ్రామస్థులు

కరీంనగర్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ నుంచి చేగుర్తికి వెళ్లే దారిలో రైల్వే గేటు పడిన ప్రతిసారి వాహనదారులు, గ్రామస్థులు పడిగాపులుకాస్తున్నారు. గతంలో అప్పుడప్పుడు పడే గేటు తరచూ పడుతోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ మీదుగా రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగింది. దీంతోపాటు ప్రత్యేక రైళ్లను కూడా నడుపుతున్నారు. మరోవైపు బొగ్గు, ఎరువులు, గ్రానైట్ గూడ్స్ రైళ్ల ఎక్కువ సంఖ్యలో వెళ్తుంటాయి. దీంతో రోజుకు 10 నుంచి 12 సార్లు గేటు పడుతోంది. నాయకులు, అధికారులు స్పందించి ఈ మార్గంలో బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం

గణేశ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యూజీసీ మార్గదర్శకాలు తీసుకురావడం విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియని, యూనివర్సిటీలు స్వయం ప్రతిపత్తిని కోల్పోయే అవకాశం ఉంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ ఎడ్యుకేషన్ మినిస్టర్ ధర్మేంద్ర ప్రదాన్ ప్రకటించిన యూజీసీ మార్గదర్శకాలపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత ఏర్పడుతోందన్నారు. యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ జిట్టి బాలకృష్ణ తెలిపారన్నారు. ప్రైవేటీకరణను ప్రోత్సహించేలా మార్గదర్శకాలు ఉన్నాయని, కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాసే చర్యగా కనిపిస్తోందని వెల్లడించారు.

చివరి ఆయకట్టుకు చేరని మిడ్‌మానేరు నీరు

- ఎండుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు



పెర్కపల్లి వద్ద నిలిచిన కాలువ నీరు



వెన్కేపల్లి శివారులో ఎండిపోతున్న మొక్కజొన్న చేనును చూపిస్తున్న రైతు

సైదాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఘణపూర్, సైదాపూర్, జాగీర్‌పల్లి, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి గ్రామాలకు కాలువ ద్వారా మిడ్ మానేరు నీరు రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. పంటలు ఎండుతున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలంలో పంటలు సుభిక్షంగా పండాలని ముందుగానే మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మానేరు కాలువకు నిధులు విడుదల చేసినప్పటికీ చివరి వరకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం పెర్కపల్లి గ్రామం వరకు నీరు వచ్చి ఆగుతుందని, అక్కడి నుంచి మిగతా ప్రాంతాలకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. కాలువల పనులు పూర్తి చేయకపోవడంతో అధికారులు కిందికి నీటిని వదులడం లేదని రైతులు పేర్కొంటున్నారు. నీరు చివరి ఆయకట్టు వరకు అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. జాగీర్‌పల్లి, రామచంద్రాపూర్, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల గ్రామాల్లో పంటలు ఎండుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు మా గ్రామాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

మొక్కజొన్న ఎండుతోంది



- ఏనుగుల మహేందర్, రైతు, వెన్కేపల్లి

సైదాపూర్ శివారులో నేను నాలుగెకరాల మొక్కజొన్న సాగు చేశాను. కానీ నీరు లేకపోవడంతో మొక్కజొన్న పూర్తిగా ఎండుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ ద్వారా నీరు విడుదల చేయాలి.

నీరులేక పంటలు ఎండుతున్నాయి



- మెడవేన రాజు, రైతు, గుజ్జులపల్లి

నేను గుజ్జులపల్లి శివారులో మూడెకరాల వరకు పల్లి చేను వేశాను. నీరు లేకపోవడంతో పూర్తిగా ఎండుతుంది. అధికారులు మిడ్ మానేరు నీరు కాలువ ద్వారా విడుదల చేసి పంటలను కాపాడాలి.

అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా



- పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి, రామచంద్రాపూర్, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల గ్రామాలకు మిడ్ మానేరు నీరు రావడం లేదని నా దృష్టికి వచ్చింది. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా.

రైతుల ఖాతాల్లో 'భరోసా' నిధులు

(5వ పేజీ తరువాయి)

ఎన్ని ఎకరాలకు రైతుభరోసా సాయం అందిస్తారో ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పథకం జనవరి 26న ప్రారంభించిన నేపథ్యంలో జిల్లాలోని మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఆ గ్రామాల్లో 14,226 మంది రైతులకు మాత్రమే సాయం అందించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 207 రెవెన్యూ గ్రామాల రైతులకు ఇంకా ఈ సహాయాన్ని అందించాల్సి ఉన్నది. గతంలో ఎకరంతో మొదలుపెట్టి రోజుకు ఒక ఎకరాన్ని పెంచుతూ వారంరోజులపాటు ఆయా విస్తీర్ణంలో సాగు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో రైతుబంధు పెట్టుబడి సాయాన్ని జమచేస్తూ వచ్చారు. ఇప్పుడు ఏ రకంగా ఎన్నిరోజుల్లో నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయో వ్యవసాయశాఖ అధికారులుగానీ జిల్లా ఉన్నతాధికారులుగాని ప్రకటించలేదు.

విద్యుత్ సంస్థ ఉత్తమ ఇంజనీర్లకు ప్రశంసపత్రాలు



ప్రశంసపత్రం అందుకుంటున్న రూరల్ ఏడీఈ రఘు

గణేశ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో పని చేస్తున్న ఇంజనీర్లు ప్రశంసపత్రాలు అందుకున్నారు. రూరల్ ఏడీఈ రఘు, టౌన్ ఏడీఈ శ్రీనివాస్, టౌన్ టు ఏడీఈ లావణ్య, జమ్మికుంట ఏడీఈ సీహెచ్ రాజేందర్, టౌన్ ఏడీఈ నజియా బేగం ఉత్తమ ఇంజనీర్లుగా ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు అంజయ్య, రమేష్, రాజు, శశికాంత్ సోమవారం అభినందనలు తెలిపారు.

గణతంత్ర వేడుకల్లో పారమిత స్కౌట్స్, గైడ్స్ ప్రదర్శన



గణతంత్ర వేడుకల్లో పారమిత స్కౌట్స్, గైడ్స్ ప్రదర్శన

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కరీంనగర్‌లోని పారమిత పాఠశాల స్కౌట్స్ గైడ్స్ కవాతు ప్రదర్శన ఆకట్టుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ సోమవారం తెలిపారు. పారమిత స్కౌట్స్, గైడ్స్‌కు కలెక్టర్ పమేలా సత్పతి ప్రశంస పత్రం అందజేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, ప్రసాద్, రమణ, హనుమంతరావు, ప్రశాంత్, కవిత అభినందించారు.

ముగిసిన సిద్ధార్థ విద్యాసంస్థల జీల్ క్రీడోత్సవాలు



విజేతలుగా నిలిచిన బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులకు నిర్వహించిన జీల్-2025 క్రీడోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ క్రీడోత్సవాల్లో కరీంనగర్‌లోని విద్యానగర్, సీతారాంపూర్, భగత్‌నగర్, మంకమ్మతోట సిద్ధార్థ విద్యా సంస్థలతోపాటు చొప్పదండిలోని సిద్ధార్థ విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిభ చాటారు. భగత్ నగర్ క్యాంపస్‌లోని క్రీడా మైదానంలో మూడు రోజులు పోటీలు నిర్వహించారు. సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి ముగింపు కార్యక్రమాలను ప్రారంభించారు. బహుమతులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్న 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి అశ్విత్ తేజ ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. విద్యార్థిని సోమవారం పాఠశాలలో మానేరు విద్యాసంస్థల అధినేత కడరి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు అభినందించారు.

ప్రజల ఆశీర్వాదంతో సమస్యలు పరిష్కరించాం

- నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న నగర మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశీర్వాదంతో నగరంలోని సమస్యలన్నీ పరిష్కరించామని, తాము చేసిన అభివృద్ధి చరిత్రలో నిలుస్తుందని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. సోమవారం కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అభివృద్ధిలో భాగంగా 15, 30, 34, 47, 54 డివిజన్లలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా రావడంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన వందల కోట్ల నిధులతో ప్రజలకు మౌలిక వసతులను కల్పించామన్నారు. 60 డివిజన్ల కార్పొరేటర్లు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను చాలా మేరకు పరిష్కరించామన్నారు. దాదాపు రూ.1400 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇటీవల హౌసింగ్‌బోర్డుకాలనీలో నిరంతర మంచినీటి సరఫరాను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు నాగసముద్రం విజయలక్ష్మి, నేతికుంట యాదయ్య, షకీరా అంజూమ్ బర్కత్ అలీ, షర్ఫొద్దీన్, ఇఫ్రాన్ తహరీన్ అథీనా, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, అనూప్, బండ సుమ రమణారెడ్డి, రాపర్తి విజయ, సరిత సతీష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

ఒకటో డివిజన్ ఆరెపల్లి రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మేయర్ సునీల్‌రావు ఆవిష్కరించారు. అనంతరం తీగలగుట్టపల్లిలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. యువత అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. పలువురు కార్పొరేటర్లు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు నుంచి వావిలాలపల్లి రోడ్డుకు జువ్వాడి రత్నాకర్‌రావు వీధిగా నామకరణం



బోర్డు ఆవిష్కరించిన మేయర్ సునీల్‌రావు, సుడాచైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సత్యనారాయణ

కరీంనగర్ టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా కోర్టు నుంచి వావిలాలపల్లికి వెళ్లే రోడ్డుకు మాజీ మంత్రి, స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు వీధిగా నామకరణం చేశారు. సోమవారం రాత్రి మేయర్ యాదగిరి సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బోర్డులను ఆవిష్కరించారు. మంత్రిగా జువ్వాడి రత్నాకర్ రావు కరీంనగర్ జిల్లా అభివృద్ధికి, ప్రజలకు చేసిన సేవలు మరువలేనివంటూ నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగారావు, నాయకులు పాల్గొన్నారు.

ఎవరు అవినీతికి పాల్పడినా చర్యలు తీసుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తమ ఐదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని, ఎవరు అవినీతికిపాల్పడినా చర్యలు తీసుకోవాలని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బుధవారం కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి పమేలాసత్పతిని కలిసి వినతి పత్రం సమర్పిస్తామని, బీఆర్ఎస్ నేతల అవినీతిని బట్టబయలు చేస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకులు, ఓ నియోజకవర్గ స్థాయి నాయకుడు తనపై చిల్లర ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు పెట్టిస్తున్నాడని మండిపడ్డారు. కేంద్రమంత్రి బండి సంజయ్ నేతృత్వంలో బీజేపీలో చేరి మోదీ నాయకత్వలో పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. తాను బీజేపీలో చేరితే వారికెందుకంత భయమని ప్రశ్నించారు. రేపటితో తమ పదవీకాలం ముగియనుండగా అవిశ్వాసమంటున్న వారి తెలివికి జోహార్ అని ఎద్దేవాచేశారు. తాను ఎనాడూ అవినీతికి పాల్పడలేదని, పాత ఇల్లు, జాగ అమ్ముకొని కొత్తది కట్టుకున్నానని తెలిపారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సింగిల్ సీటు దక్కకుండా ప్రయత్నిస్తామన్నారు. బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మేయర్ సునీల్‌రావును సస్పెండ్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కరీంనగర్ టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మేయర్ యాదగిరి సునీల్ రావును వెంటనే సస్పెండ్ చేయాలని, ఐదేళ్లలో ఆయన చేసిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి చట్టపరంగా శిక్షించాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి హరిశంకర్ ఆధ్వర్యంలో 31 మంది కార్పొరేటర్లు కలెక్టర్ పమేలాసత్పతిని కలిసి మేయర్ సునీల్ రావుపై అవిశ్వాస నోటీసుతోపాటు సస్పెండ్ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ టికెట్‌పై కార్పొరేటర్‌గా గెలిచి మేయర్‌గా ఎన్నికైన సునీల్‌రావు ఐదేళ్లలో నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అధికారం కోసం బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారని, సునీల్‌రావు అవినీతిపై విచారణ జరిపి శిక్షించాలని అన్నారు.

మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి):ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, కళామండలి రాష్ట్ర కో ఆర్డినేటర్ రామంచ భరత్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగా చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జనవరి27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏడీఈ రఘు ప్రకటనలో తెలిపారు. రేకుర్తి, పాతవాడ, కొత్తవాడ, లయోలా కళాశాల, హనుమాన్ నగర్, ఇందిరమ్మ కాలనీ, కంటి ఆస్పత్రి ప్రాంతం, బుడిగ జంగాల కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

బండి సంజయ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

కరీంనగర్ అర్బన్: కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌వి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరమ్మ ఫొటోపెడితే ఇందిరమ్మఇళ్లకు కేంద్రం నిధులు ఇవ్వబోమనడం హాస్యాస్పదమని తెలిపారు.

31న కొబ్బరికాయల విక్రయానికి వేలం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జ్యోతి నగర్ హనుమాన్ సంతోషిమాతా ఆలయంలో ఈనెల 31న ఉదయం 10-30 గంటలకు, ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మధ్యాహ్నం 12-30 గంటలకు కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయ హక్కు కోసం వేలం నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో 31న ఉదయం 11 గంటలకు కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయం, కమ్యూనిటీ హాల్‌లో సౌండ్ సిస్టం, పెళ్లి పందిరి అలంకరణకు వేలం నిర్వహించనున్నట్లు ఈవో వెంకన్న తెలిపారు.

లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు

సుభాష్‌నగర్: లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ సెంట్రల్ చార్టర్ జిల్లా గవర్నర్ చిదుర సురేష్ జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం నగరంలోని ఆశాజ్యోతి పీపుల్స్ వెల్ఫేర్ సొసైటీలో నిరుపేద, అనాథ పిల్లలకు నిత్యావసరాలు అందజేశారు. వైశ్యభవన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్‌పై అవగాహన

సుభాష్‌నగర్: కరీంనగర్‌లోని అపోలోరీచ్ ఆస్పత్రిలో సోమవారం నిధి ఆప్‌కే నికత్ 2.0 పీఎఫ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్ పెన్షన్‌పై అవగాహన కల్పించారు.

ఇటుక బట్టీలను రద్దు చేయాలి

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్లలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఇటుక బట్టీలను రద్దు చేయాలని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కాశిపాక రాకేష్ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ముగిసిన మహాభారత ప్రవచన జ్ఞాన యజ్ఞం

కరీంనగర్ కల్చరల్: ప్రముఖ పండితుడు మల్లాది చంద్రశేఖర శాస్త్రి శత జయంతి సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలో రాగంపేట ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ నలుమాచు మనోహర్, దాతల సహకారంతో ప్రారంభమైన మహాభారత ప్రవచన జ్ఞాన యజ్ఞం సోమవారంతో ముగిసింది.

ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్: నగరంలోని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం బ్యాంక్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

కరీంనగర్ రూరల్ : కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో సర్వే నంబరు 765లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త దొమ్మటి బాబు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

కేంద్ర మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

భగత్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంపై బీజేపీ నాయకుడు గణేష్ ఆధ్వర్యంలో సోమవారం కోతిరాంపూర్ చౌరస్తాలో కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, బండి సంజయ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు .

మెడికల్ రిప్రజెంటేటీవ్స్ కార్యవర్గం

సుభాష్‌నగర్: తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ జిల్లా అధ్యక్షుడిగా కొండి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా మిరుపాల అంజయ్య తదితరులు ఎన్నికయ్యారు.

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ప్రఫుల్ దేశాయ్

హుజూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపల్ ప్రత్యేకాధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ప్రఫుల్ దేశాయ్‌కు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

● జమ్మికుంట: జమ్మికుంట మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎండి ఆయాజ్ ఆయనను ఘణంగా సత్కరించి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా కలెక్టర్ సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజలు ఏదైనా సమస్య ఉంటే నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నూతన సాంకేతికతకు అనుగుణంగా బోధన జరగాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో వస్తున్న నూతన సాంకేతిక మార్పులను గమనిస్తూ, దానికి అనుగుణంగా అధ్యాపకులు విద్యార్థులకు బోధించాలని కిట్స్ కళాశాల సెక్రెటరీ, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అడ్వాన్స్‌డ్ ఇన్ మాన్యుఫాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీ-4.0 సినారియోపై కళాశాల అధ్యాపకులకు ఆరు రోజుల ఆటల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఎన్ఐటీ అధ్యాపకులు కుమార్ మాట్లాడుతూ కోర్ ఇంజనీరింగ్ బ్రాంచెస్ మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ విభాగాలలో చదివే విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ శంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సతీష్‌కుమార్ అధ్యాపకులు ఉన్నారు.

పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మానకొండూర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ 415 రోజులైనా హామీలు అమలు చేయలేదన్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదన్నారు. నియోజకవర్గంలో నాలుగు వందల ఇళ్లకు నిధులు మంజూరు చేస్తే తాను ఎన్నికల్లో పోటీచేయనని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బీవి రామకృష్ణారావు, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: మండలంలోని మొగిలిపాలెం గ్రామానికి చెందిన వంతడుపుల సంపత్ మానకొండూరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియామకమయ్యారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు, మాజజీ ఎంఎల్‌సీ నారదాసు లక్ష్మణరావుల నుంచి సంపత్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వంతడుపుల సంపత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించినందుకు మండల అధ్యక్షుడు రావుల రమేష్, మాజీ ఎంపీపీ కేతిరెడ్డి వనిత, మాజీ జడ్పీటిసి ఇనుకొండ శైలజ, రాష్ట్ర నాయకులు ఏకానందం, అశోక్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

చొప్పదండి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను అన్ని గ్రామాలకు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిగతా గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారో లేదోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మొగిలి మహేష్, మాజీ ఎంపీటీసీ తోట కోటేష్, గొల్ల సునంద గట్టయ్య, గంట రవి, సింగిరెడ్డి భూమారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగట్టు దేవాలయ అభివృద్ధికి కృషి



కొత్తగట్టు ఆలయం వద్ద కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న కవ్వంపల్లి

శంకరపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి దేవాలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే సత్యనారాయణకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఫిబ్రవరి 4నుంచి 19వరకు జరిగే శ్రీమత్స్యగిరీంద్రస్వామి జాతర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే రూ. 36.30లక్షల సీజీఎఫ్ నిధులతో నిర్మించిన కల్యాణ మండపం, లడ్డు ప్రసాదాల కౌంటర్‌లను ప్రారంభించారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, ఈవో సుధాకర్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, హుజూరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పారువెల్లలో సీసీరోడ్లకు శంఖుస్థాపన

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఈజీఎస్ కింద రూ.10 లక్షల నిధులు మంజూరు కాగా సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రోడ్డు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి విడుదలైన నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ నాణ్యమైన రోడ్లను వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ లీగల్‌సెల్ కన్వీనర్ లింగంపల్లి శ్రీకాంత్, మల్లిఖార్జున్, సంగు దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతుల పక్షపాతి

ఇల్లందకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ స్టేట్ డైరెక్టర్ ఎక్కటి సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఇల్లందకుంట మండలంలోని బోగంపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 26న కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు పథకాల కోసం బోగంపాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడం జరిగిందన్నారు. గ్రామంలో 536 ఎకరాలకు 238రైతుల ఖాతాల్లో రూ. 32,17,200 జమచేశారన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్

చిగురుమామిడి, జనవరి 27(ఆంధ్రజ్యోతి) మండలంలోని చిన్న ములకనూర్ మోడల్ స్కూల్‌లో యసీయంఎఫ్, బోథ్ బ్రిడ్జ్, చెన్నై వారి ఆధ్వర్యంలో 9,10 తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సోమవారం కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు త్వరగా ఉపాధి అవకాశాలు పొందే కోర్సుల గురించి వివరించారు. ప్రభుత్వ, ప్రవేటు రంగాలలో ఉన్న ఉపాధి అవకాశాలు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా రాబోయే ఉద్యోగ అవకాశాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సంస్థ సీఈఓ బాలరాజు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ హర్షిత్‌కౌర్, గైడ్ టీచర్లు విముక్తి ప్రసాద్, బి శైలజ ఉన్నారు.

కోట్ల నర్సింహులపల్లిని పర్యాటక కేంద్రంగా మార్చాలి



విగ్రహాలను పరిశీలిస్తున్న కర్ర సత్యప్రసన్న తదితరులు

గంగాధర, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కోట్ల నర్సింహులపల్లిని పర్యాటక కేంద్రంగా మార్చాలని కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న అన్నారు. సోమవారం గంగాధర మండలం కోట్ల నర్సింహులపల్లి 4సంవత్సరాల క్రితం బయటపడిన జైన విగ్రహాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పురాతన దేవాలయం , జైన మత విగ్రహాలు బయటపడుతున్నందున ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని ఆమె ప్రభుత్వాన్ని జైన మతస్తురాలు మీనా జైన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ కార్యదర్శి నేరెళ్ల కవిత తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల సమస్యలు పరిష్కరించాలి



రాస్తారోకో చేస్తున్న జర్నలిస్టులు

హుజూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ నుంచి జర్నలిస్టులు ర్యాలీగా బయలుదేరి వచ్చి అంబేద్కర్ చౌరస్తా వద్ద నినాదాలు చేశారు. అనంతరం హుజూరాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత 25ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు గత ప్రభుత్వం నివేశన స్థలాలకు పట్టాలు ఇవ్వగా నిర్మాణం చేపట్టామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కన్వీనర్ గడ్డం ధర్మారెడ్డి, కో-కన్వీనర్లు కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణ, ఎం రవీందర్, అంజనేయస్వామి, నరేందర్, యాదగిరి, పిల్లల సతీష్‌కుమార్, కామిని రవీందర్, భరణికుమార్, మక్సూద్, సత్యరాజ్, సునీల్, బి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వీణవంక, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మల్లారెడ్డిపల్లి-అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బొంతుపల్లికి చెందిన జున్నుతుల కౌసల్య జ్ఞాపకార్థం ఆమె కుమారుడు రాఘవరెడ్డి పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. రిటైర్డు ఆర్డీవో రామకృష్ణా రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

పరిహారం అందించాలి

హుజూరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తమ భూమి నుంచి నేషనల్ హైవే-563 బైపాస్ రహదారి వెళ్తోందని విచారణ చేపట్టి పరిహారం అందించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కనకయ్యకు రాంపూర్‌కు చెందిన కాశిరెడ్డి తిరుపతిరెడ్డి, కాశిరెడ్డి కరుణాకర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.

కృత్రిమకాలు అందజేత

జమ్మికుంట రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు బుర్ర అరుణ్‌గౌడ్‌కు ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు, ఐఏఎస్ అధికారి పరిపండ్ల నరహరి చొరువతో హైదరాబాద్‌లోని శ్రీభగవాన్ మహావీర్ ట్రస్ట్ సౌజన్యంతో జైపూర్ ఫూట్ (కృత్రిమ) కాలును అందజేశారు.

మోర బద్రేశంకు అభినందన

రామడుగు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేటలో నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అతిపెద్ద జాతీయ జెండాను వితరణ చేసిన లైన్స్ క్లబ్ సెకండ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మోర బద్రేశంకు క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు. సుమారు రూ.25 వేలతో తయారు చేసిన జెండాను సభ్యులకు అందించారు.

ఆర్థిక సహాయం అందజేత

చొప్పదండి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం గామా ఫౌండేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 130 కుటుంబాలకు వెయ్యి రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. డైరెక్టర్ జోగు పాల్, మాజీ ఎంపీపీ కృష్ణహరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గంగయ్య గౌడ్ ఉన్నారు.

లక్ష్యసాధనపై అవగాహన

చొప్పదండి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలికల కళాశాలలో సోమవారం 'విద్యార్థులు లక్ష్యసాధన' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఎస్సారార్ పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జెన్నపు ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.